
మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్

గణేశ్ ఉత్సవాల్లో పాశ్చాత్య సంస్కృతి ఉండొద్దు

- ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్

ముషీరాబాద్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): హిందువులంతా సంఘటితంగా గణేశ్ ఉత్సవాలను జరుపుకోవాలని ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని హెరిటేజ్ హాల్‌లో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ముషీరాబాద్ నియోజకవర్గం ఆధ్వర్యంలో మండపాల నిర్వాహకులు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాలలో పాశ్చాత్య సంస్కృతి లేకుండా భజనలు, ఆధ్యాత్మిక భావనతో నిర్వహించి హిందూ సమాజ శక్తిని చాటి చెప్పాలన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులు లేకుండా చేయడమే లక్ష్యంగా ఒక వర్గం పనిచేస్తుందని విమర్శించారు. సమావేశంలో ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి ఆర్. శశిధర్, ముషీరాబాద్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్, సెంట్రల్ కమిటీ సభ్యుడు నాయిని బుచ్చిరెడ్డి, ఆలె భాస్కర్‌రాజు, బీజేపీ ముషీరాబాద్ కన్వీనర్ రమేష్‌రాం తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు ఆహ్వానం

చిక్కడపల్లి, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి దేవాలయంలో ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వినాయకచవితి నవరాత్రి, బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఆలయం ఈవో లక్ష్మారెడ్డి ఆదివారం ఎంపి డా. కె. లక్ష్మణ్‌కు ఆహ్వానపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రత్నసాయిచంద్, శ్రీకాంత్, ఆలయ మాజీ ధర్మకర్త రమణ, సిబ్బంది రాజు తదితరులు పాల్గొన్నారు.


శాస్త్రినగర్‌లో బోర్‌వెల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో తాగునీరు, కలుషిత నీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. రాంనగర్ డివిజన్‌లోని శాస్త్రినగర్ అపార్ట్‌మెంట్ వాసులకు తన సొంత నిధులు రూ. 50 వేలతో ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు ఆర్. మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణపై వ్యాసరచన పోటీలు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యల నివారణపై విద్యార్థినీవిద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా. హిప్నో పద్మాకమలాకర్, నవభారత్ లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు జి. కృష్ణవేణి తెలిపారు. ఆదివారం అశోక్‌నగర్‌లోని మైండ్ అండ్ పర్సనాలిటీకేర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 4 నుంచి 9వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పోటీలు జరుగుతాయని వివరించారు. 10వ తేదీన ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించి విజేతలకు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, మానసిక నిపుణులు బహుమతులు అందజేస్తారని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న సంజీవకుమార్ అగర్వాల్

హిందూ ఆలయాలపై దాడి చేస్తున్నవారికి బుద్ధి చెప్పాలి

కవాడిగూడ , సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలు, హక్కులను కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని విశ్వహిందూ పరిషత్ విద్యానగర్ జిల్లా చిక్కడపల్లి అధ్యక్షుడు సంజీవకుమార్ అగర్వాల్ సూచించారు. విశ్వహిందూ పరిషత్ విద్యానగర్ జిల్లా చిక్కడపల్లి ప్రఖండ 60వ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని హిందూ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కవాడిగూడ డివిజన్ దోమలగూడ న్యూ ఎస్‌బీహెచ్ కాలనీలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. హిందూ దేవాలయాలపై దాడులు చేస్తున్న వారికి బుద్ధి చెప్పేందుకు ఐక్యమత్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి అజయ్‌రాజ్, జిల్లా బజరంగ్ సంయోజక్ అభిషేక్, చిక్కడపల్లి ప్రఖండ సంయోజక్ గణేష్, విద్యార్థి ప్రముఖ్ మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీజేఎస్ నాయకులు

4న ప్రొఫెసర్ కోదండరాంకు ఆత్మీయ పౌరసన్మానం

చిక్కడపల్లి, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు ఈనెల 4న ఆత్మీయ పౌర సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని టీజేఎస్ గ్రేట్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నరసయ్య తెలిపారు. ఆదివారం గాంధీనగర్ డివిజన్‌లో కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోయర్‌ట్యాంక్‌బండ్ కట్టమైసమ్మ దేవాలయం నుంచి ఇందిరాపార్కు, బీమా మైదాన్, అశోక్‌నగర్, గాంధీనగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్ మీదుగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీజేఎస్ గ్రేటర్ హైదరాబాద్ ప్రధానకార్యదర్శి బట్టల రామచందర్, బీసీ సెల్ అధ్యక్షుడు జశ్వంత్‌కుమార్, ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు గుండెల్లిరవీందర్‌యాదవ్, కవాడిగూడ అధ్యక్షుడు అజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి వరకు బీజేపీ సభ్యత్వ నమోదును పూర్తిచేయండి

రాంనగర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లో బీజేపీ సభ్యత్వ టార్గెట్‌ను పూర్తి చేసేందుకు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రోయ్యూరు శేషసాయి సూచించారు. ఆదివారం రాంనగర్ గుండు ప్రాంతంలో డివిజన్ అధ్యక్షుడు నరేష్‌కుమార్ అధ్యక్షతన సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం జరిగింది. శేషసాయి మాట్లాడుతూ.. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు ఈ నెల 3వ తేదీన అన్ని డివిజన్లలో సభ్యత్వ నమోదును పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోపాల్, నాయకుడు రమేష్‌రాం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రొయ్యూరు శేషసాయి


జవహర్‌నగర్‌లో కార్లపై కూలిన చెట్టు


బాగ్‌అంబర్‌పేటలో కూలిన చెట్టు


అంబర్‌పేట చెన్నారెడ్డినగర్‌లో కూలిన చెట్టు

ఎడతెరిపిలేని వర్షం

లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం ● విద్యుత్ సరఫరాకు అంతరాయం

- వాహనాలపై కూలిన చెట్లు
- మూడు కార్లు ధ్వంసం

ముషీరాబాద్ / అంబర్‌పేట జోన్ బృందం (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షంతో ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. పలుచోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. కాచిగూడ, లింగంపల్లి ప్రాంతంలో చెట్టు కూలడంతో వైర్లు తెగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వీఎస్టీ చౌరస్తా, పార్సీగుట్టరోడ్డు, కవాడిగూడ ప్రాంతాలలో రోడ్లు జలమయమయ్యాయి. నాగమయ్యకుంట, పద్మాకాలనీ, అంజయ్యనగర్ లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అంబర్‌పేట, బాగ్ అంబర్‌పేట, గాంధీనగర్, చెన్నారెడ్డినగర్ ప్రాంతాల్లో చెట్లు కూలాయి. బాగ్‌అంబర్‌పేటలో కూలిన చెట్లను కార్పొరేటర్ బి.పద్మా వెంకటరెడ్డి జీహెచ్ఎంసీ సిబ్బందిని పిలిపించి తొలగింపజేశారు. రాంనగర్‌లో పరివాహక ప్రాంతంలో ఉధృతంగా ప్రవహిస్తున్న హుస్సేన్‌సాగర్ నాలాను కార్పొరేటర్ కె.రవిచారి పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీలో రోడ్డుపై మురుగు నీరు

- గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ ఆంధ్రాకేఫ్ చౌరస్తాలో కరెంట్ ఆఫీస్ పక్కన చెట్టు కూలి రెండు కార్లు ధ్వంసమయ్యాయి. నర్మద నర్సింగ్‌హోమ్ వద్ద ఓ కారుపై చెట్టు కూలింది. అరుంధతి నగర్, సబర్మతినగర్‌లో కాంగ్రెస్ నాయకులు పర్యటించి వరద నీటితో ఇబ్బంది పడుతున్న ప్రజలను పరామర్శించారు.
- భోలక్‌పూర్ డివిజన్‌లోని పద్మశాలి కాలనీలోకి వరద నీరు పెద్ద ఎత్తున రావడంతో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ నిండి రోడ్డుపై మురుగునీరు ఏరులై పారింది.
- ముషీరాబాద్ డివిజన్‌లో రాజాడీలక్స్ చౌరస్తా వద్ద వర్షం నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.


వీఎస్టీ చౌరస్తా వద్ద రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



స్టీల్‌బ్రిడ్జి, సుందరయ్య విజ్ఞానకేంద్రం వద్ద వర్షంలోనే రాకపోకలు సాగిస్తున్న ప్రజలు


ముషీరాబాద్ డివిజన్ రాజాడీలక్స్ చౌరస్తా వద్ద రహదారిపై నిలిచిన వర్షపు నీరు


గాలికి ట్యాంక్‌బండ్‌పై రోడ్డుపైకి ఒరిగిన ఇనుప రేకు


చిక్కడపల్లి బ్రిడ్జి వద్ద హుస్సేన్‌సాగర్ నాలా ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి


అరుంధతినగర్ బస్తీవాసులను పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకుడు గుర్రం శంకర్ తదితరులు

కష్టపడి చదివితే మంచి భవిష్యత్

- ప్రొఫెసర్ సీహెచ్ గోపాల్‌రెడ్డి

రాంనగర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మహాత్మా గాంధీ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సీహెచ్ గోపాల్‌రెడ్డి అన్నారు. సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అవంతి డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం శనివారం రాత్రి జరిగింది. గోపాల్‌రెడ్డి విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేసి మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో తట్టుకోవడానికి నిరంతరం అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిభ ఎవరి సొత్తు కాదని, విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్ ఉంటుందన్నారు. పోటీ పరీక్షల్లో స్కిల్స్‌ను సంపాదించాలంటే నిత్యం న్యూస్ పేపర్స్ చదవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల నైపుణ్యాన్ని ప్రోత్సహిస్తుందని, అందులో భాగంగానే ఇంటర్, డిగ్రీ స్థాయిలోనే సాంకేతిక విద్యతోపాటు ఒకేషనల్ కోర్సును ప్రవేశపెడుతుందన్నారు. కార్యక్రమంలో ఓయూ అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ ఎ. కృష్ణంరాజు, ప్రముఖ పర్యావరణవేత్త ఠాకూర్ రేష్మాసింగ్, అవంతి విద్యా సంస్థల జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం. ప్రియాంక, అధ్యక్షులు ఎం.జ్ఞానేశ్వరి, మేనేజింగ్ డైరెక్టర్ శ్రావణ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఎం.వి.ఎస్.ఎస్.నందీష్, హెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై.జయప్రద, డాక్టర్ డి.వెంకట్‌రావు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వీరసోమయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సీహెచ్ గోపాల్‌రెడ్డి

సీపీఎస్ వద్దు.. ఓపీఎస్ ముద్దు

- గన్‌పార్క్‌వద్ద ఉద్యోగుల నిరసన

అఫ్జల్‌గంజ్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా ఆదివారం రాష్ట్ర జేఏసీ నేతలు మారం జగదీశ్వర్, ఏలూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. భారీ వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సీపీఎస్ వద్దు.. ఓపీఎస్ ముద్దు అని నినదించారు. కార్యక్రమంలో శ్రీపాల్‌రెడ్డి, స్థితప్రజ్ఞ, గజిటెడ్ అధికారుల సంఘం ప్రధానకార్యదర్శి ఎ.సత్యనారాయణ, కేంద్ర సంఘం ప్రధానకార్యదర్శి డా.ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్), అధికారుల సంఘం ప్రతినిధులు వెంకట్, కృష్ణయాదవ్, కేంద్ర సంఘం సభ్యులు కస్తూరి వెంకటేశ్వర్లు, ఉమాదేవి, శైలజ, బొల్లిగిద శంకర్, నాల్గవ తరగతి కేంద్ర సంఘం అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్, ఖాదర్ బిన్ హసన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జేఏసీ నేతలు, ఉద్యోగులు

గాలి కాలుష్యంతో శ్వాస వ్యాధుల విజృంభణ

- వైద్య నిపుణుడు వీరపనేని విష్ణున్‌రావు



హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు గాలి కాలుష్యం, మరోవైపు రసాయనాలతో ఉత్పత్తిచేసిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఉబ్బసం, శ్వాసకోశవ్యాధులు విజృంభిస్తున్నాయని, పర్యావరణాన్ని పరిరక్షించుకోకపోతే మానవ మనుగడ ప్రమాదంలో పడుతుందని ప్రముఖ వైద్య నిపుణుడు, శ్వాస హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ వీరపనేని విష్ణున్‌రావు పేర్కొన్నారు. శ్వాస సంబంధమైన వ్యాధులపై ఆయన కొన్ని దశాబ్దాలుగా పరిశోధనలు చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తులు, సైనస్, ఉబ్బసం వ్యాధులపై పరిశోధన సంస్థలు ఇచ్చే నివేదికలను కూడా అధ్యయనం చేస్తున్నారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సూచనలు చేశారు. నగరంలో నివసించే వారికి వాహన, పరిశ్రమల వల్ల వెలువడే కాలుష్యం గాలి ద్వారా ఊపిరితిత్తులకు ప్రవేశిస్తుందన్నారు. వర్షం నీటి తడివల్ల నేల, చెట్లు, భవనాలు, చెత్తాచెదారం ఒకవిధమైన బ్యాక్టీరియాను కలిగి ఉంటాయని, గాలి కలుషితం ఎక్కువగా ఉంటుందన్నారు. వర్షా కాలంలో హోటళ్లు, ఆరుబయట రోడ్లపై విక్రయించే ఆహార పదార్థాలు తినొద్దన్నారు. రోజువారీ వ్యాయామం, ఇతరత్రా జాగ్రత్తల వల్ల వ్యాధులను అదుపులో ఉంచవచ్చన్నారు.



సమావేశంలో పాల్గొన్న సీఐ సీతయ్య, డాక్టర్ శ్రావణ్‌కుమార్, పి. జితేందర్‌రెడ్డి తదితరులు

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రాంనగర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య సూచించారు. బాగ్‌లింగంపల్లిలోని వీఎస్టీ ఫంక్షన్ హాల్‌లో శనివారం రాత్రి న్యూ ఎరా కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమం జరిగింది.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్స్‌కు సలహాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధినేత డాక్టర్ శ్రావణ్ కుమార్, ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ పి. జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ అధికారులకు సత్కారం

బేగంపేట, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఎంపికలో రాజకీయ పైరవీలకు తావులేకుండా పారదర్శకంగా జరగాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం బేగంపేటలోని హరితప్లాజాలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఆధ్వర్యంలో 16 మంది నిజాయితీ అధికారులను సత్కరించి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మీనారాయణ, ఐఏఎస్ విశ్రాంత అధికారి ఆకునూరి మురళీ మాట్లాడుతూ.. నిజాయితీ అధికారుల సంఖ్య పెరగాలన్నారు. సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్, సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి తదితరులు పాల్గొన్నారు.


అవార్డులు అందుకున్న వారితో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, ఐఏఎస్ విశ్రాంత అధికారి ఆకునూరి మురళీ తదితరులు

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి

ముషీరాబాద్ కన్వీనర్‌గా రాజేష్‌చారి

ముషీరాబాద్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ముషీరాబాద్ డివిజన్ కన్వీనర్‌గా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాజేష్ చారి, కో–కన్వీనర్‌లుగా వసంత్, సుమిత్, రవిశంకర్ నియమితులయ్యారు. ఆదివారం భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ వారికి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి నాయకులు విశాల్‌గౌడ్, శివాజీ, ఆయూష్‌రాజ్ శరణ్ పాల్గొన్నారు.

'కులగణనకు కమిటీని నియమించాలి'

చిక్కడపల్లి, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): జనాభా దామాషా ప్రకారం కులగణనకు కమిటీని నియమించాలని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర కో-ఆర్డినేటర్ గోధుమల కుమారస్వామి డిమాండ్ చేశారు. చిక్కడపల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కులగణన చేసి బీసీలకు న్యాయం చేయాలని ఆమరణ దీక్ష చేస్తున్న బత్తుల సిద్దేశ్వర్, రాజారామ్ యాదవ్, ఆజాది చాపర్తి కుమార్‌కు మద్దతు తెలుపుతున్నామన్నారు. బీసీల పేరు చెప్పుకుని పదవులు పొందిన నాయకులు కులగణన విషయమై మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. ఆ నాయకులు ఆమరణ దీక్ష చేస్తున్న బీసీ నాయకులకు సంఘీభావం ప్రకటించి కార్యాచరణకు ముందుకు రావాలని కుమారస్వామి డిమాండ్ చేశారు.

సిద్దేశ్వర్ పటేల్‌కు పరామర్శ

ముషీరాబాద్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన చేపట్టాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు గంగుల మధుయాదవ్ డిమండ్ చేశారు. బీసీ డిమాండ్ల సాధన కోసం గాంధీ ఆస్పత్రిలో ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న సిద్దేశ్వర్ పటేల్‌ను ఆదివారం పరామర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల హక్కుల కోసం ఐక్యంగా పోరాడతామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యాదవ సంఘం నాయకులు మల్లేష్ యాదవ్, రాజారాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


గాంధీ ఆస్పత్రిలో సిద్దేశ్వర్ పటేల్‌ను పరామర్శిస్తున్న మధు యాదవ్ తదితరులు

హెబ్రోన్ చర్చిలో ప్రశాంతంగా ప్రార్థనలు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చిలో ఆదివారం ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. గత కొన్నేళ్ళుగా సొసైటీ, ట్రస్టు మధ్య విబేధాలు జరుగుతున్న విషయం తెలిసిందే. దీనిపై కోర్టులో కేసులు కొనసాగుతున్నాయి. శనివారం రాత్రి చర్చివద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఆదివారం క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు పరిస్థితిని సమీక్షించారు. ఇరువర్గాలతో మాట్లాడామని, ఐక్యంగా చర్చి నిర్వహణ, ప్రార్థనలు జరుపుకోనున్నట్లు వివరించారు. భవిష్యత్‌లో విబేధాలకు తావులేకుండా చర్చి కార్యకలాపాలు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఎఫ్ పీటర్, దైవసేవకులు వై. జాన్ సుబ్బారెడ్డి, జోసెఫ్ కురియన్, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

రంజింపజేసిన 'రైతు రాయల స్వర్ణ చరితం'

రవీంద్రభారతి, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల జీవిత విశేషాలతో రూపొందించిన రైతు రాయల స్వర్ణచరితం నృత్యరూపకాన్ని ఆదివారం రవీంద్రభారతిలో ప్రదర్శించారు. భారత రంగస్థల అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ నృత్యరూపకం ప్రేక్షకులను రంజింపజేసింది. ముఖ్యఅతిథిగా ప్రభుత్వకార్యదర్శి బుర్రా వెంకటేశం హాజరై కళాకారులను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సంగనభట్ల నర్సయ్య, డా. ఏటీకే ప్రసాద్, మామిడి హరికృష్ణ, భాగవతుల సేతూరాం, గుడివాడ నాగరత్నం నాయుడు, ఈమని శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. నాట్యం, నటనతో కళాకారులు ఆకట్టుకున్నారు.


రైతు రాయల స్వర్ణచరితం నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు